క్లుప్తంగా

మాదకద్రవ్యాలను అరికట్టాలి

అన్నపురెడ్డిపల్లి: మాదకద్రవ్యాలను అరికట్టాలని స్థానిక ఎస్సై చంద్రశేఖర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఆటో స్టాండ్ వద్ద మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహనా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిషేధిత గంజాయిని ఎవరైనా రవాణా చేసినా, విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యబలిపూజ మహోత్సవం

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని ఆరోగ్యమాత చర్చీలో దివ్యబలిపూజ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం పీఠాధిపతి డాక్టర్ ప్రకాష్ సగిలి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివ్యబలిపూజ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చీ రెవరెండర్ ఫాదర్ కిన్నెర రమేష్ ఆధ్వర్యంలో సెయింట్ జోసఫ్ పాఠశాల నుంచి పీఠాధిపతి డాక్టర్ ప్రకాష్‌ను ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, పూలు జల్లుతు ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, టీ సురేష్, బడుగు శంకర్, నల్లమోతు రమణ, ఉప్పతల ఏడుకొండలు పాల్గొన్ని క్రైస్తవ సోదరులకు సంఘీభావం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మూలమలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో మోటార్‌సైకిల్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మోటార్‌సైకిల్ నడుపుతున్న యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అతనిని స్థానికులు 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి వివరాలు తెలియలేదు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బదిలీలు నిలిపివేయాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్ క్రింద పని చేస్తున్న 15మంది ఫిట్టర్లను బదిలీ చేసిందని, బదిలీలను నిలుపుదల చేయాలని కోరుతూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి మాట్లాడుతూ.. ఏరియాలో ఫిట్టర్ల అవసరం ఉన్నప్పటికీ.. యాజమాన్యం వారిని బదిలీ చేయడం వల్ల కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బదిలీలను నిలుపుదల చేసి ఖాళీలను భర్తీ చేయించేందుకు చొరవ చూపాలని ఆయన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల వితరణ

అశ్వారావుపేటరూరల్: అగ్ని ప్రమాద బాధితురాలికి స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం వితరణ అందించారు. మండలంలోని వినాయకపురం కొత్త కాలనీకు చెందిన ఒంటరి మహిళ నాగళ్ల పూరిల్లు పూర్తిగా కాలిపోవడంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు బాధితురాలికి రూ.5వేల నగదును తక్షణ సాయం కింద అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరాల శ్రీను, నల్లపు నరసింహారావు, నల్లపు సతీష్, జక్కుల జగదీష్, నారం జగదీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎరియర్స్ చెల్లించాలి

మణుగూరురూరల్: మున్సిపల్ కార్మికులకు ఏరియర్స్ చెల్లింపుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇఫ్టూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు ఆదివారం ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. మణుగూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పలు విభాగాల వర్కర్లకు పీఆర్‌సీ నివేదిక ప్రకారం పెరిగిన వేతనాలు, ఏరియర్స్ చెల్లించాల్సి ఉండగా నేటి వరకు ఇవ్వలేదన్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి రాజేందర్, పొడుతూరి లక్ష్మీనారాయణ, ఆర్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల దినోత్సవం

దుమ్ముగూడెం: ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని మండలంలో ప్రతి ఒక్కరు వైభవంగా ఆదివారం నిర్వహించుకున్నారు. మిత్రులకు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టి స్వీట్స్ తినిపించి వారి జీవితంలో స్నేహం ఎంత విలువైనదో ఒకరికి ఒకరు పంచుకున్నారు. చిన్నల నుంచి పెద్దల వరకు స్నేహితుల దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

శిథిల భవనం.. భయం భయం

- కూల్చివేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- మంత్రి తుమ్మల ఆదేశాలు బుట్టదాఖలు

అశ్వారావుపేటరూరల్: విద్యాశాఖకు చెందిన ఓ భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. భవనం పైకప్పు పెచ్చులూడి పడుతుండగా, గోడలకు పెద్ద పెద్ద బీటలు ఏర్పడ్డాయి. ప్రమాదకరంగా ఉన్న ఆ భవనాన్నే స్టోర్ రూమ్‌గా వినియోగిస్తుండగా, ఏ క్షణం ఏలాంటి ప్రమాదం జరుగుతుందోననే భయం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి.

అశ్వారావుపేట మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం భవనం(ఎమ్మార్సీ కార్యాలయం) సుమారు నాలుగేళ్ల క్రితం శిథిలావస్థకు చేరింది. ఈ భవనం స్లాబు పెచ్చులు ఊడి పడుతుండగా, గోడలకు భారీగా బీటలు వచ్చాయి. భవనం గోడలు, ఫీలర్ల మధ్య ఖాళీలు ఉండగా, వెనుక వైపు ఉన్న గోడల నుంచి చెట్ల వేర్లు బయటకు వస్తున్నాయి. దీంతో ఈ భవనం నేడో, రేపో కూలిపోతుందన్నట్లు మారింది. శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని స్థానిక విద్యాశాఖ అధికారులు నాలుగేళ్ల క్రితమే ఖాళీ చేసి పక్కనే ఉన్న భవిత భవనంలోకి ఎమ్మార్సీ కార్యాలయాన్ని మార్చారు. ఆ నాటి నుంచి భవిత భవనంలోనే ఎమ్మార్సీ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ భవనాన్ని మాత్రం పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం తోపాటు ఇతర సామగ్రిని ఉంచేందుకు వాడుతున్నారు. దీంతో ఆయా సామగ్రి కోసం నిత్యం ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు వెళ్లి వస్తుంటారు. ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు భవనం లోపలికి వెళ్లిన సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే అంతే సంగతులు. దీంతో స్థానిక ఎమ్మార్సీ సిబ్బంది, ఉపాధ్యాయులంతా భయం



శిథిలావస్థకు చేరిన ఎమ్మార్సీ భవనం, (ఇన్‌సెట్) బీటలు వారిన భవనం గోడ

భయంగా.. గడుపుతున్నారు.

మంత్రి ఆదేశాలు బుట్టదాఖలేనా!

శిథిలమైన భవనాలు, ముఖ్యంగా విద్యాశాఖకు చెందిన భవనాలు ఉంటే వాటిని తక్షణమే కూల్చి వేసి, కొత్త భవనాలకు ప్రతిపాదనలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొద్ది రోజుల క్రితమే ఆదేశించారు. ఈ నెల 21వ తేదీన అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్టు గండ్లు పరిశీలించేందుకు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో సమీక్షించారు. శిథిలమైన, బీటలు వారిన భవనాలను తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా విద్యాశాఖ భవనాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని చెప్పారు. కానీ నేటికి అధికారులు మాత్రం ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో, మంత్రి ఆదేశాలు బుట్టదాఖలైనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారులకు సమాచారమిచ్చాం



ఎమ్మార్సీ భవనం శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా ఉన్న మాట వాస్తవమే. కొద్ది రోజుల క్రితమే ప్రమాదకరంగా ఉన్న భవనాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని అశ్వారావుపేట పంచాయతీ రాజ్ డీఈఈ శ్రీధర్‌కు సమాచారం అందించాను. భవనాన్ని పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

– కీసర లక్ష్మి, ఎంఈఓ, అశ్వారావుపేట

'స్వచ్ఛదనం–పచ్చదనం' విజయవంతం చేయాలి



అన్నపురెడ్డిపల్లి: రహదారి పక్కన ఏర్పడిన గుంతను పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

అన్నపురెడ్డిపల్లి: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని ఎర్రగుంట, అన్నపురెడ్డిపల్లి పంచాయతీలలో ఆయన పర్యటించి, సోమవారం నుంచి ప్రారంభం కానున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాలలో చెత్తా చెదారం, మురుగునీరు నిల్వలు లేకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 9వ తారీకు వరకు జరిగే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టాలని, మొక్కలను నాట్టాలని, డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ షాబ్బా, పంచాయతీ కార్యదర్శులు ఖాదర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని, శ్రమదానం చేయాలని దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం(నేడు) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం నిర్వహించనున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, స్వయం సహాయక సంఘాలు, గ్రామస్తులు, యువత స్వచ్ఛందంగా పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలి

దుమ్ముగూడెం: బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని ఆపి సింగరేణికే అప్పగించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం యలమంచి సీతారామయ్య భవన్‌లో యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగావెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు ప్రజల హక్కు అని అన్నారు. సింగరేణి ప్రైవేటు వ్యక్తులకు అమ్మకం కేవలం సింగరేణి కార్మికులకే కాదని వారిపై ఆధార పడిన కుటుంబాలు చిరు వ్యాపారులు అందరుపైనా ఈ ప్రభావం ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి బీజేపీ ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయిన కిషన్ రెడ్డి వెంటనే బొగ్గును ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడానికి పూనుకున్నారని విమర్శించారు. బీజేపీ తక్షణమే బొగ్గు బ్లాకు సింగరేణి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష పార్టీలను కేంద్రం వద్దకు తీసుకుపోయి సింగరేణి సంస్థను కాపాడవలసిన బాధ్యత ఉన్నదని హితవు పలికారు. బొగ్గు బ్లాకుల వేలం నిలుపుదలకు సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా బొగ్గు పరివాహక



సమావేశంలో మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

ప్రాంతాలలో బస్సు యాత్ర సాగుతున్నదని, ఈ యాత్ర రేపు కొత్తగూడెం చేరుకొని ముగింపు సభ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్ మండల కార్యదర్శి కారం పుల్లయ్య, మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మా, యలమంచి శ్రీను బాబు, సోడి రాంబాబు, వాగే ఖాదర్ బాబు, మహమ్మద్ బేగ్, సోయం నాగమణి, కూరం వీరభద్రం, కాక కృష్ణ, గుడ్ల సాయి రెడ్డి, యానబోయిన వెంకట నర్సయ్య, సోయం వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల స్మారక స్తూపాల కూల్చివేత

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం పోలీసు బలగాలు మావోయిస్టుల స్మారక స్తూపాలను కూల్చివేశారు.

జిల్లాలోని భైరంఘడ్, జంగ్లా పోలీస్ స్టేషన్ల పరిధిలోని హింగూమ్, జూరామొంగియా గ్రామాల సమీపంలో ఇదివరికే నిర్మించి ఉన్న మావోయిస్టుల మూడు స్మారక స్తూపాలను తొలగించారు. సుమారు 20 అడుగుల ఎత్తు ఉన్న ఈ స్తూపాలను డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్ విభాగాలకు చెందిన బలగాలు కూల్చివేశాయి.

ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలి



కరకగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కరకగూడెం: ఈ నెల 9వ తారీకున నిర్వహించబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలనీ ఆదివాసీ ఉద్యోగ్య సంఘం సలహాదారు నాయకులు మలకం కుమారస్వామి కోరారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో ఆయన అధ్యక్షతన ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి ఆదివాసీ ఐక్య వేదికగా (జేఏసీ) ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొగ్గల రవి, ఉపాధ్యక్షుడిగా ఊకె గణేష్, ప్రధాన కార్యదర్శిగా కలం సాంబమూర్తి కమిటీ సభ్యులను పలువురిని ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవంన ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని, చట్టబద్ధత లేని వలస లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు ఐక్యవేదిక నాయకులు తుడుం దెబ్బ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పినపాక: ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని మండల అధ్యక్షుడు తుళెం శ్రీను అన్నారు. ఈ మేరకు జానంపేటలోని కొమరం భీం విగ్రహం వద్ద ఆదివారం ఆదివాసీ జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చించి తీర్మానాలు చేశారు. ప్రభుత్వం ఆదివాసి దినోత్సవ పురస్కరించుకొని సెలవు ప్రకటించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు మంత్రులకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

చర్లరూరల్: చర్ల మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.ఈదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరకానున్నట్లు తెలిపారు. సమావేశానికి మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

రేపు హరిదాసు ఆరాధనోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అంబసత్రం వ్యవస్థాపకుడు దివంగత పమిడిఘంటం వెంకట రమణ హరిదాసు 105వ ఆరాధనోత్సవాలను ఈ నెల 6న ఘనంగా నిర్వహించనున్నట్లు సత్రం నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది పి.రఘురామ్, పీవీ రమణలు కుటుంబ సమేతంగా పాల్గొంటారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పొట్టి శ్రీరాములు పేరుతోనే కొనసాగించాలి

ములకలపల్లి: తెలుగు విశ్వ విద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘ జిల్లా మాజీ కోశాధికారి బిక్కుమళ్ల సుధాకర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరుమార్చి, సురవరం ప్రతాప్‌రెడ్డి పేరుగా మార్చాలనే ఆలోచన సరికాదని అన్నారు. బాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి తుదిశ్వాస వరకూ పోరాడిన అమరజీవి శ్రీరాములు చిరస్మరణీయుడని ఆయన కొనియాడారు.

సీపీఎం నాయకుడి మృతి

బూర్గంపాడు: సీపీఎం సీనియర్ నాయకుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు బర్ల తిరుపతిరావు(58) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. పాఠశాలల్లో, కళాశాలల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అనేక చైతన్యవంతమైన కార్యక్రమాలను నిర్వహించి జిల్లాస్థాయిలో ఆయన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మృతదేహానికి సీపీఎం నాయకులు ఎంబీ నర్సారెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, రాయల వెంకటేశ్వర్లు, కందుకూరి నాగేశ్వరరావు నివాళులర్పించారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం డిపో పరిధిలో గత రెండు నెలలుగా గోదావరి వరదల కారణంగా ఆదాయం భారీగా తగ్గిందని, శ్రావణమాసంలో ఆదాయం పెంచే విధంగా అధికారులు కృషి చేయాలని ఖమ్మం డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) పవిత్ర తెలిపారు. భద్రాచలం డిపోలో ఆదివారం జరిగిన సూపర్వైజర్‌ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శ్రావణమాసం ముప్పై రోజుల్లో పదిహేను పెళ్లి ముహుర్తాలు ఉన్నందున రద్దీ ఎక్కువగా ఉంటుందని, రద్దీకి అనుగుణంగా ఎక్కువ సంఖ్యలో బస్సులని నడపాలని సూచించారు. డిపో నుంచి పెళ్లి బస్సులు ఎక్కువగా బుక్ చేసుకునే విధంగా సిబ్బంది, సూపర్వైజర్‌లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలిపారు. పెళ్లి బస్సులకి ఎటువంటి డిపాజిట్ లేకుండా ప్రయాణించే దూరానికి మాత్రమే డబ్బులు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమం లో అసిస్టెంట్ మేనేజర్ గౌతమీ, మెకానికల్ ఫోర్ మెన్ చక్రవర్తి, సూపర్వైజర్‌లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బూర్గంపాడు: అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల అందిస్తామని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు రైతు వేదికలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 77మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేస్తున్నామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పేదింటి ఆడపిల్లల పెళ్లిలకు ఆర్థికభరోసా కల్పిస్తున్నామన్నారు. తొందరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తుందన్నారు. రుణమాఫీ అమలుతో రైతుల అప్పులు తీర్చి వారికి ఆర్థిక వెసులుబాటు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రుణమాఫీ చేసిన రైతులందరికి మళ్లీ బ్యాంకులలో పంటరుణాలు ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీఓ సునీల్, ఏపీఎం నాగార్జున, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్

మణుగూరుటౌన్: రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అన్నివర్గాలకు అండగా ఉంటుందని, కులమతాలకతీతంగా అన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం తహసీల్దార్ రాఘవరెడ్డి అధ్యక్షతన ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలుకు కృషి చేస్తోందన్నారు. రైతు రుణమాఫీ చేసిన గత చరిత్ర కాంగ్రెస్‌దేనని మళ్లీ



మణుగూరుటౌన్: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం, ప్రజాప్రతినిధులు

ఇచ్చిన మాట నిలబెట్టుకుని రైతుల పక్షపాతి అని నిరూపించుకుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు త్వరలో కులమతాలకతీతంగా అందించే ప్రక్రియ ప్రారంభమవుతోందని కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని దళారులను ప్రోత్సహించొద్దని అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 14 పంచాయతీలకు చెందిన 120 మంది లబ్ధిదారులకు రూ.1.20 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ప్రజాభవన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం అహ్మదుల్లా, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, గణేశ్‌రెడ్డి, దొబ్బల వెంకటప్పయ్య, వరలక్ష్మి, గాండ్ల సురేశ్, జీవీ, పాతూరి వెంకన్న, కూచిపూడి బాబు, గోరంట్ల కనకయ్య, కూరపాటి సౌజన్య, తాటి భిక్షం, కటుకూరి శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేశా..



మల్లెలమడుగులో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సుజాత

అశ్వాపురం: ఎంపీపీగా తన పదవి కాలంలో మండలంలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశానని ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులకు ఆదివారం ఎంపీపీ సుజాత శంకుస్థాపన చేశారు. తురుములగూడెం, కొమ్ముగూడెం గ్రామాల్లో గ్రావెల్ రోడ్లు, మిట్టగూడెంలో మజీద్ ప్రహరీ గోడ, కళ్యాణపురంలో సీసీ రోడ్డు, మల్లెలమడుగులో కల్వర్టు, చింతిర్యాలలో బోరు నిర్మాణానికి ఎంపీపీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, జిల్లా, మండల కో ఆప్షన్ సభ్యులు షర్పియుద్దీన్, ఎస్‌కే.ఖదీర్, ఎంపీటీసీలు ఏనిక రవి, గాదె జయ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ

భద్రాచలంఅర్బన్: కేరళలోని వయనాడ్లో కొండ చరియలు విరిగి పడిన దుర్ఘటనలో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు సీపీఎం విరాళాల సేకరణ చేపట్టింది. ఆ పార్టీ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో ప్రజల నుంచి ఆదివారం విరాళాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన అండగా నిలబడే తత్వం భద్రాచలం ప్రజలకు ఉందని గతంలో కూడా అనేక సార్లు ప్రకృతి వైపరీత్యాలుసంభవించినప్పుడు అక్కడి ప్రజలకు భద్రాచలం ప్రజలు అండదండలుగా నిలిచారని వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. బాధితులను ఆదుకొనేందుకు వయనాడ్ రిలీఫ్ ఫండ్ పేరుతో విరాళాలు అందజేయాలని ఆయన దాతలకు విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు దాతలు ఇతోధికంగా విరాళాలు ఇవ్వాలని కోరారు. కేరళ లో జరిగిన ప్రకృతి వైపరీత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాల్సిన కేంద్ర ప్రభుత్వం రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం గంగా, బండారు శరత్ బాబు, ఎర్రంశెట్టి వెంకట రామారావు, పారెల్లి సంతోష్ కుమార్, నాదెండ్ల



భద్రాచలంఅర్బన్: బాధితుల కోసం భద్రాచలంలో విరాళాలను సేకరిస్తున్న సీపీఎం నాయకులు

లీలావతి, పట్టణ నాయకులు నాగరాజు, లక్ష్మణ్, భూపేందర్, కనక శ్రీ, ఆది శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వరదల బీభత్సానికి నష్టపోయిన, మరణించిన వ్యక్తుల కుటుంబాలకు సహాయర్థం, సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం విరాళాలు సేకరించారు. మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో ఇంటింటా తిరుగుతూ విరాళాలు సేకరించగా, గ్రామస్తులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, చెన్నుబోయిన బ్రహ్మయ్య, కూచిపూడి రవి, ఎస్‌కే నభి, గుండు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బోనాల సంబురాలు

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో గిరిజనులు ఆదివారం బోనాల సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఆషాడమాసంను పురస్కరించుకుని ముత్యాలమ్మ దేవతకు సాంప్రదాయంగా బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను ఎత్తుకుని ప్రదర్శనగా ముత్యాలమ్మ దేవత వద్దకు చేరుకున్నారు. దేవత వద్ద మొక్కులు తీర్చుకున్నారు.



తిప్పనపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

జోరుగా వరి నాట్లు!



కరకగూడెం: తాటిగూడెంలో పొలంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

కరకగూడెం: మండలంలో వరి నాట్లు జోరందుకున్నాయి. గత వారం రోజులు విరామం లేకుండా కరిసిన వర్షాలు తెరపినివ్వడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాల్వలు, చెరువులు, బోర్ల కింద వరి నాట్లు వేసేందుకు పొలాలను రైతన్నలు సిద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు సక్రమంగా కురవక నాట్లు ఎలా వేయాలా అని అన్నదాతలు సతమతమవుతున్న సమయంలో జోరుగా వర్షాలు కురిశాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. దీంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఒకేసారి రైతులంతా నాట్లు వేస్తుండడంతో కూలీల డిమాండ్ పెరిగింది. చుట్టుపక్కల గ్రామాల్లో నాట్లు వేయడానికి రైతులు కూలీలను ఆటోల్లో తరలిస్తున్నారు. కాగా ఆదివారం తాటిగూడెం గ్రామంలోని ఓ రైతు పొలంలో నాటు వేస్తున్న కూలీలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.